సాక్షి ఒడిశా

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3.31.377
బంగారం	5 గ్రాముల 780 మిల్లీ గ్రాములు
వెండి	55 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

ఉత్సవం.. వైభవం

రాష్ట్రవ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవి మండపాలు, ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

- 10లో





రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం చేయడంతో ప్రాణదాతలుగా నిలవవచ్చని ఎంపీ చంద్రశేఖర్ సాహు అన్నారు.

- 10లో

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యే జుధిష్టర్ సామంతరాయ్ కనుమూత



జుధిష్టర్ సామంతరాయ్ (ఫైల్)

భువనేశ్వర్: పూరీ జిల్లా పిప్పిలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జుధిష్టర్ సామంతరాయ్ సోమవారం కనుమూశారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 72 ఏళ్లు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజకీయ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు జుధిష్టర్ సామంతరాయ్ మృతికి సంతాపం తెలిపారు. 1995 నుంచి 2000 వరకు రాష్ట్ర శాసనసభలో పిప్పిలి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1984 నుంచి 1990 సంవత్సరం వరకు పిప్పిలి మండలం అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



చెట్టుకు వేలాడుతున్న మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీవీ 27 గ్రామంలో సోమవారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా ఒక మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అసీమ్ గినా అనే వ్యక్తి కూతురు శిబాని గిన(25)కు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే ఏదో కారణంతో ఆమె కొద్దిరోజులుగా పుట్టింటిలోనే ఉంటోంది. ఇటీవల రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు తీవ్రంగా వెతికినా ఆచూకీ దొరకలేదు. కాగా సోమవారం తెల్లవారుజామున సమీప అడవిలో కుళ్లిన వాసన రావడంతో స్థానికులు టార్చిలైట్ వేసి చూడగా మృతదేహం కనిపించింది. వెంటనే కలిమెల పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతిరాలి తండ్రి అసీమ్ శనివారం రాత్రే పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ సోమవారం సాయంత్రం వచ్చిన తర్వాత మృతదేహాన్ని దింపి పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే ఆమెను ఎవరైనా చంపివేశారా.. లేదా ఉరి వేసుకుందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

15 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన ప్రైవేటు బస్సు

జయపురం: మల్కన్‌గిరి నుంచి ఛత్తీష్‌ఘడ్ రాష్ట్ర రాయిఘర్‌కు వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సులో 15 కేజీల గంజాయిని జయపురం సదర్ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. గంజాయితో పాటు బస్సును సీజ్ చేశామన్నారు. అయితే ఎవరినీ అరెస్టు చేయలేదని, కానీ ముగ్గురు బస్సు సిబ్బందిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారిలో గగణాపూర్ పోలీసు పంటి అధికారి రాజకిశోర్ బారిక్ పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మల్కన్‌గిరి నుంచి రాయిపూర్ వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సును తణికీ చేస్తుండగా అందులో ఒక ట్రాలీ బ్యాగ్ కనిపించిందని, బస్సులో కేవలం 6 ప్రయాణీకులు మాత్రమే ఉన్నారని వెల్లడించారు. ఆ బ్యాగ్ ఎవరిదని ప్రశ్నించగా ఎవరూ తమదని చెప్పలేదని వెల్లడించారు. ట్రాలీ బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో గంజాయి బయట పడిందని తెలిపారు. డ్రైవర్, కండక్టర్, క్లీనర్‌లు సైతం బ్యాక్ ఎవరిదో తమకు తెలియదని అన్నారని పోలీసు అధికారి వెల్లడించారు. దీంతో బస్సుతో పాటు అందరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామని, బస్సు సిబ్బంది ముగ్గురుని విచారిస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి రవాణాలో పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.



సిజిమాలిలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్న ప్రాంతం

- సిజిమాలిలో బాక్సైట్ తవ్వకాలకు ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజలతో సమావేశమైన అధికారులు, కంపెనీ ప్రతినిధులు
- నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వెల్లడి

మీ మాటే శాసనం..!



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రధాన్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న మైత్రీ కంపెనీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ తదితరులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి సుంగేరి పంచాయతీ పరిధి సిజిమాలి ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం సోమవారం నిర్వహించిన ప్రాజాభిప్రాయ సేకరణ కార్యక్రమం పూర్తయ్యింది. సుంగేరి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాయగడ రీజనల్ అధికారి అశోక్ కుమార్ భోయిలు పాల్గొన్నారు. సుంగేరి, ఒడాజోర్, నకురుండి, తొలొపాదొరొ, సింధూర ఘాటి పంచాయతీల్లోని కొంటామాల్, బందేల్, సర్గిపాదొరొ, మజ్జిగా, సర్కాపాయి, సుంగేరిగాడొ, మురలిముయి, తడవి, కెరపాయి, కచలేక, కొడాపాయి, నెలరూప, సెమికాల్, రుపేస్ డెంగూస్, మెలబార్, ఒనికొన, తరముండి, ఇతరకొన, మకూల్, చిగ్రూస్, తడమోడి, అమ్‌కొటనకరుండి, జొంగిజోర్, మోయినాని, ఒనిమోస్కా తదితర ప్రభావిత గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజల అభిప్రాయాలు సేకరించారు.

అభిప్రాయాల ప్రకటన

జిల్లా అదనపు కలెక్టర్ రామేశ్వర్ ప్రధాన్ ముందుగా ఈ సమావేశంలో పాల్గొన్న ప్రజల అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. దీంతో గ్రామస్తులు బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. అయితే పర్యావరణం కలుషితమవ్వకుండా ఈ తవ్వకాలను చేపట్టాలని కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, మరికొందరు తమ ప్రాంతంలో మౌలిక సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సుమారు గంట పాటుగా కొనసాగిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు వారి వ్యక్తిగత అభిప్రాయాలను రికార్డు చేశారు. బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.

తగు న్యాయం చేయాలి

కొన్నేళ్ల క్రితం కాసీపూర్ సమితి టికిరిలో ఉత్కళ అలూమిన కర్మాగారం ఏర్పాటుకు ముందు కర్మాగారం యాజమాన్యం ఎన్నో హామీలు ఇచ్చిందని ప్రజలు గుర్తు చేశారు. కానీ కర్మాగారం ఏర్పాటైన తర్వాత ఇచ్చిన హామీలను మరిచారని, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తామంతా ముందుగానే అప్రమత్తమయ్యామని పేర్కొన్నారు. అందువల్ల తమ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను చేపడితే తమకు సరైన న్యాయం చేయాలని, అప్పుడే తాము ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయమని స్పష్టం చేశారు.

బాక్సైట్ హబ్‌గా గుర్తింపు

జిల్లాలోని కాసీపూర్ సమితి బాక్సైట్ గనులకు హబ్‌గా గుర్తింపు పొందడంతో వాటిని సద్వినియోగపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో వేదాంత్ కంపెనీకి తవ్వకాల కోసం అనుమతులు ఇచ్చింది. వేదాంత్ కంపెనీ బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి మైత్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీకి సిజిమాలి ప్రాంతంలో తవ్వకాల కోసం లీజ్ ఇచ్చింది. మైత్రీ కంపెనీ పనులను ప్రారంభించింది. అయితే తవ్వకాల కోసం ముందుగా ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన గ్రామాల్లో మైత్రీ కంపెనీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సీఈవో సత్యనారాయణలు విస్తృతంగా పర్యటించి అక్కడి వారి అభిప్రాయాలను సేకరించారు. తాము గ్రామస్తులకు అండగా ఉంటామని, విద్య, వైద్యం, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలను కల్పించడంతో పాటు గ్రామస్తులకు అన్నివిధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అయితే ఈ సమయంలో కొంతమంది బాక్సైట్ తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో స్పందించిన జిల్లా యంత్రాంగం సిజిమాలి ప్రాంతంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు నిర్ణయించింది. తవ్వకాలకు సంబంధించి మొదట్లో కొంతమంది వ్యతిరేకించినా, అనంతరం సుముఖత వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ ప్రజాభిప్రాయ సేకరణలో దాదాపుగా అందరూ తవ్వకాలకు ఒప్పుకున్నా, కొందరు భిన్నభిప్రాయాలు వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. అయితే తవ్వకాలు చేపడితే ఇక్కడ కొత్త పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉండటంతో పాటు తమ ఆర్థిక, సామాజిక అవకాశాలు మెరుగుపడతాయని మరికొందరు పేర్కొన్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ప్రజాభిప్రాయ సేకరణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. సుమారు పది ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. ఎస్పీ వివేకానంద శర్మ సమావేశం జరిగే ప్రాంతంలో స్వయంగా ఉండి పరిస్థితిని సమీక్షించారు. సమావేశంలో మైత్రీ కంపెనీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, సీఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భద్రతా చర్యలు చేపడుతున్న పోలీసు బలగాలు

ఫణి బాధితుల ఆందోళన



జాతీయ రహదారి దిగ్బంధించిన దృశ్యం

- పూరీ–భువనేశ్వర్ జాతీయ రహదారి దిగ్బంధం



జాతీయ రహదారిపై స్తంభించిపోయిన వాహనాలు


భువనేశ్వర్: ఫణి తుఫాన్ బాధితులు హక్కుల కోసం పోరాటానికి శంఖారావం పూరించారు. పూరీ–భువనేశ్వర్ జాతీయ రహదారిని పూరీ మాలతీపట్‌పూర్ వద్ద రెండు గంటల పాటు సోమవారం దిగ్బంధించడంతో రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పర్యాటకులు, యాత్రికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పూరీ జిల్లా కలెక్టర్లు తమకు వాగ్దానాలు చేసి మోసం చేశారని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. 4 ఏళ్లు గడిచినా బాధితులకు ఆర్థిక సాయం అందలేదన్నారు.

ఇదీ విషయం...

2019 మే నెలలో ఫణి తుఫాన్ సంభవించింది. ఈ తుఫాన్ ధాటికి పూరీ జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు పూరీ జిల్లాలోని 11 మండలాల్లో ప్రభావిత ప్రజలకు ఆ సాయం అందకపోవడంపై వీరంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ వేలాది మంది ప్రజలు సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో మొత్తం 7,568 మంది బాధితుల జీపీఎస్ ఫొటోలను ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయానికి సమర్పించారు. పూరీ జిల్లా ప్రకృతి వైపరీత్యాల ప్రతీకార క్రియాశీలక కమిటీ మరియు ఒడిశా జన శక్తి మంచ్ ఆధ్వర్యంలో నిరసనకారులు జాతీయ రహదారి దిగ్బంధించారు. తక్షణమే తుఫాన్ సాయం విడుదల చేయాలని నినాదాలతో హోరెత్తించారు. బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని మండిపడ్డారు. దీంతో జిల్లా యంత్రాంగం చర్చకు పిలుపునిచ్చింది. కాగా డిమాండ్లను నెరవేర్చకుంటే రానున్న రోజుల్లో ఇటువంటి ఆందోళనలు నిరవధికంగా కొనసాగిస్తామని బాధితులు హెచ్చరించారు.

అందరికీ ఆహారం

ఆకలి రహిత ఒడిశా కోసం అవగాహనతో సమష్టి కార్యాచరణకు శ్రీకారం చుడదామని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఒక్కరూ, ప్రతిచోటా తగినంత పోషకమైన ఆహారాన్ని సక్రమంగా పొందే స్థిరమైన ప్రపంచాన్ని నిర్మించడంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన సోషల్ మీడియాలో ఈ సందేశం ప్రసారం చేయడం విశేషం. - భువనేశ్వర్



క్రీడలతో మానసికోల్లాసం



బిశ్వనాథ్ నాయిక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: క్రీడలతో ప్రతి ఒక్కరికీ శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మాజీ మంత్రి రబినారాయణ నందో అన్నారు. స్థానిక కృష్ణచంద్ర పాఠాఘర్, ఒడియా సమాయ్ ప్రాంగణంలో 5 లక్షలతో నిర్మించిన వ్యాయామశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాయామశాలను పాఠాఘర్ సభ్యులు తమ నిధులతో నిర్మించడం, అలాగే పాఠాఘర్‌ను పునః నిర్మాణం చేసి అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందన్నారు. పాఠాఘర్‌కు అధిక పుస్తకాలు సమకూర్చడం వలన పాఠకులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఎవరి వద్దనైనా పుస్తకాలు ఉంటే అందజేయాలని కోరారు. పాఠాఘర్ అధ్యక్షుడు బిష్ణుప్రసాద్ పాత్రో మాట్లాడుతూ పాఠాఘర్ ఉన్నతికి సభ్యులు ఎంతో సహకరించారని, ఇకపై కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేపాల్‌లో జరిగిన బరువు వెయిట్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకాలు సాధించిన బిశ్వనాథ్ నాయిక్, సీనియర్ న్యాయవాది లక్ష్మీకాంత పండా, సీనియర్ సభ్యుడు తరణీ చరణ దాస్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

శ్రీమందిరం నాలుగు ద్వారాలు తెరవాలి

- పూరీలో కాంగ్రెస్ భారీ ర్యాలీ
- ద్వారాలు తెరవకపోవడంతో ప్రభుత్వంపై మండిపాటు
- ఆలయ సీఏవోకు వినతిపత్రం అందజేత



పూరీ వీధుల్లో భారీ నిరసన చేపడుతున్న దృశ్యం



శ్రీమందిరం సీఏవో రంజన్ కుమార దాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: శ్రీజగన్నాథ ఆలయ రత్న భాండాగారం తనిఖీ, నాలుగు ద్వారాలు తెరవాలనే వాదన క్రమంగా బలం పుంజుకుంటోంది. స్వామివారి దర్శనం కోసం ప్రధాన ఆలయం 4 ద్వారాలు తెరవాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సోమవారం పూరీలో భారీ నిరసన చేపట్టింది. దీనిలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తలు మరియు నాయకులు శ్రీక్షేత్రంలో సమావేశమయ్యారు. గుండిచా ఆలయం నుంచి శ్రీజగన్నాథ ఆలయ కార్యాలయం (ఎస్‌జేటీఏ) వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. తమ డిమాండ్లతో చేసిన నినాదాలు పరిసరాలను మారుమోగించాయి. ప్లకార్డులు, బ్యానర్లు, పార్టీ జెండాలతో పెద్దఎత్తున కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతల బృందం రాష్ట్ర గవర్నర్‌ను ఉద్దేశించిన వినతిపత్రం ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన కుమార్ దాస్‌కు సమర్పించింది.

ద్వారాలు తెరవక ఇబ్బందులు

ఆలయం నాలుగు ద్వారాలు తెరవడానికి ప్రభుత్వం విముఖత చూపుతుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ధ్వజమెత్తారు. శ్రీమందిరానికి వచ్చే భక్తుల సౌకర్యాలపై ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కోవిడ్ మహమ్మారి తొలగిపోయినా ఆలయం నలువైపుల ద్వారాలు తెరవకూడదని ఎస్‌జేటీఏ నిర్ణయించడంపై మండిపడ్డారు. పవిత్ర కార్తీక మాసంలో స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. కార్తీక మాసంలోపు డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కోవిడ్ దృష్ట్యా

కోవిడ్ మహమ్మారి ఆంక్షల దృష్ట్యా ప్రభుత్వం సింహద్వారం గుండా మాత్రమే అప్పట్లో భక్తులను అనుమతించింది. అయితే కోవిడ్ -19 పరిస్థితి ఇకపై లేదని పేర్కొంటూ, శ్రీమందిర్ అన్ని గేట్లను తెరవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతుందో తెలియజేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సింహద్వారం గుండా మాత్రమే భక్తులు ఆలయ ప్రవేశం చేస్తుండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి అన్నారు. పశ్చిమ ద్వారం గుండా ప్రవేశం పూరీ వాసులకు మాత్రమే పరిమితం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మరియు బయట ప్రాంతాల నుంచి ఆలయాన్ని సందర్శించే వారికి ఇది పెద్దగా ఉపయోగపడదని ఆయన విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ బిజయ్ కుమార్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రజలు, భక్తుల కోరిక మేరకు శ్రీమందిరం నలువైపులా అన్ని ద్వారాలను తెరవాలని డిమాండ్ చేశారు. అలాగే 12వ శతాబ్దానికి చెందిన రత్న భండాగారాన్ని తెరిచి మరమ్మతులు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజలు కూడా కోరుతున్నారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వేదాంత కంపెనీ ఆక్రమించిన 6 వేల ఎకరాల భూమిని అప్పగించాలని, హెరిటేజ్ సిటీ సుందరీకరణ కోసం ప్రభుత్వం కూల్చివేసిన అమాయక ప్రజల ఆవాసాలు, దేవాలయాల పునరుద్ధరణతో ప్రభావితులకు సముచిత పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 28లోగా ఆలయం 4 ద్వారాల తలుపులు తెరవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహిస్తామని కాంగ్రెస్ అల్టిమేటం జారీ చేశారు. ఈ వినతిపత్రం రాష్ట్ర గవర్నర్‌కు పంపనున్నట్లు ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన్ కుమార్ దాస్ తెలిపారు. డిమాండ్లను పరిశీలించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల చోరీ నిందితుడు అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలోని బంజనగర్ పోలీసులు దాడులు చేపట్టి 24 సెల్‌ఫోన్లు, ఒక నాటు తుపాకీతో నిందితుడిని అరెస్టు చేసిన ఘటన నగరంలో చర్చనీయాంశంగా మారింది. బంజనగర్ ఎస్‌డీపీవో బిష్ణు ప్రసాద్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. సోమవారం గంజాం పోలీసు జిల్లా పరిధిలో గత కొద్ది రోజుల నుంచి వివిధ ప్రాంతాల్లో జరిగిన మొబైల్స్ దోపిడికి సంబంధించి నిందితుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దగ్గర నుంచి ఒక నాటు తుపాకీని సైతం సీజ్ చేశారు. అరెస్టైన నిందితుడు ఎం.మారియా కొద్ది రోజుల నుంచి దారిన వెళ్లినవారిని భయపెట్టి సెల్‌ఫోన్లు దొంగలిస్తున్నట్లు వెల్లడించారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ నితీష్ వాద్వానీ

మల్కన్‌గిరి: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నితీష్ వాద్వానీ నేతృత్వంలో సైబర్ నేరాలపై అవగాహన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సైబర్ మోసగాళ్లను ఎలా అరికట్టాలో వివరించారు. గత నెల 30వ తేదీ నుంచి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ చైతన్య రథం జిల్లాలో తిరుగుతోంది. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి ధ్రువ చరణ్ ముదిలి, సీడీపీవో సేన్ పటేల్, డీఎస్పీ సత్య భరత్ భుయాన్, మల్కన్‌గిరి ఐఐసీ రీగా నేకిండో తదితరులు పాల్గొన్నారు.

పశువుల వ్యాన్ సీజ్

గజపతినగరం : దత్తిరాజేరు మండలం మరడాం గ్రామానికి చెందిన వాసుదేవరావు పది పశువులను అక్రమంగా అలమండ సంతకు వ్యాన్‌లో తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు నిందితుడితో పాటు పశువుల వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై గంగరాజు సోమవారం సాయంత్రం తెలిపారు. పశువులను తరలిస్తున్న వాసుదేవరావును గజపతినగరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని ఆయనపై కేసును నమోదు చేసి వ్యాన్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్న యువకుడు తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి మండలం తండా గ్రామానికి చెందిన పెరుమళ్ల గుణ(27) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఓ షాపు లీజుకు తీసుకుని హాట్‌చిప్స్ పేరుతో వ్యాపారం సాగిస్తున్న గుణకు భార్య అభి, ఏడాది వయస్సున్న కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి యథాతథంగా భార్య, బిడ్డలతో గుణ నిద్రకు ఉపక్రమించాడు. అయితే అర్ధరాత్రి 1గంట సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్న భర్తను గమనించిన భార్య కిందికి దింపి తెల్లవారుజామున ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇచ్చింది. విషయం తెలిసిన ఎస్.కోట పోలీసులు వచ్చి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడి తండ్రి పెరుమాళ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు నుంచి జారి పడి జంగేటి మణికంఠ(25) అనే యువకుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ రమేష్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం పట్టణంలోని జెండాల వీధికి చెందిన మణికంఠ ఆదివారం రాత్రి విశాఖపట్నం నుంచి ఆముదాలవలసకు ఈస్ట్‌కోస్ట్ రైలులో ప్రయాణిస్తుండగా చీపురుపల్లి వచ్చేసరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెచ్‌సీ తెలిపారు.


ఈవీఎంల తనిఖీ ప్రారంభం

పార్వతీపురంటౌన్: ఈవీఎంల తనిఖీ పార్వతీపురం మన్యం సోమవారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియను కలెక్టర్ నిషాంత్ కుమార్ పరిశీలించారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈవీఎంల మొదటి దశ తనిఖీలను బెంగళూరుకు చెందిన బీఈఎల్ ఇంజినీర్లు సుమారు 20 రోజుల పాటు నిర్వహించనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహల నివృత్తికి మొదటి దశ ఈవీఎంల తనిఖీకి ప్రతిరోజూ హాజరు కావాలని ప్రజాప్రతినిధులకు కలెక్టర్ సమాచారం అందజేశారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రత, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. తనిఖీల నిర్వహణ సమయంలో మొబైల్ ఫోన్లను అనుమతించలేదు.

ఉత్సవం.. వైభవం

రాష్ట్రవ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవి మండపాలు, ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, శక్తి పీఠాలు, పూజా మండపాల్లో అమ్మవారు బహుళ రూపిణిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: పెద్ద బ్రాహ్మణవీధిలో పూజలందుకుంటున్న అమ్మవారు



బరంపురం: గిరి మార్కెట్‌లో...



భువనేశ్వర్: చవులియా గంజ్ జయదుర్గా దేవి విశ్వ మోహిని అలంకరణ



జయపురం: జమాల్ కాలనీలో కొలువుదీరిన దుర్గాదేవి



బరంపురం: పెద్ద బజార్ ప్రాంగణంలో...



భువనేశ్వర్: వాసంతి దుర్గామాత అన్నపూర్ణ అలంకరణ



బరంపురం: హన్‌మాన్ బజార్‌లో...



జయపురం: రాజగారి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పెండాల్



జయపురం: జయనగర్ కూడలిలో ఏర్పాటు చేసిన పెండాల్



భేజీపూర్ మార్కెట్‌లో...



బరంపురం: కోర్టుపేటలో...



బరంపురం: పెద్ద బజార్ ప్రాంగణంలో...



భువనేశ్వర్: సరస్వతీ రూపంలో ఝంజిరి మంగళామాత



భువనేశ్వర్: కటక్ చండీమాత శోడషీ స్వరూపం



జయపురం: భగవతీ మందిరానికి పోటెత్తిన భక్తులు

కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మొక్కజొన్న పంటకు మద్దతు ధరపై జిల్లా నవ నిర్మాణ కృషక్ సంఘటన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. గజపతి జిల్లా నవ నిర్మాణ్ కృషక్ మోర్చా సంఘటన్ జిల్లా ప్రభారీ రంజిత్ పట్నాయక్ ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. ముఖ్యంగా అరవై ఏళ్లు దాటిన రైతులకు కనీస పెన్షన్ రూ.5 వేలు ప్రభుత్వం అందించాలని, వార్ధక్య పింఛన్ రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పదిహేను రోజుల్లోగా పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆందోళనలో రైతులు బి.శంకరరావు, దండాశి ఖండువాలా, లక్ష్మీ నాయక్, పూర్ణా గొమాంగో, బి.ధర్మారావు, హరి భూమలో తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో జీఎంఆర్ విద్యార్థులకు ప్రథమ స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజాం: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ విశాఖపట్నం నిర్వహించిన జాతీయ స్థాయి రోబో రంబుల్ పోటీల్లో స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు సత్తా చాటారు. విశాఖపట్నంలో అక్టోబర్ 13 నుంచి 15 వరకూ జరిగిన జాతీయ స్థాయి శాశ్వత్-2023లో భాగంగా నిర్వహించిన రోబో రంబుల్ ఫైనల్స్ పోటీల్లో జీఎంఆర్ ఐటీ ఈసీఈ విభాగం విద్యార్థులు కె.దిలీప్‌కుమార్, కె. గోపి, ఎస్.మహేశ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. విద్యార్థులకు గైడ్ గా కళాశాల ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్ వ్యవహరించారు. సత్తా చాటిన విద్యార్థులను జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్‌లు సోమవారం అభినందించారు.

పామాయిల్ తోటల పెంపకంపై రైతుల ఆసక్తి



బూర్జ నుంచి ట్రాక్టర్‌తో పామాయిల్ గెలలు తరలిస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడడంతో చెరకు సాగు చేసే పొలాల్లో ప్రత్యామ్నాయంగా పామాయిల్ తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కర్మాగారం పరిధిలో ఉన్న బొబ్బిలి, సీతానగరం తదితర 6 మండలాల్లో రైతులు 65 సంవత్సరాలుగా 15 వేలనుంచి 20 వేల ఎకరాల్లో ఆనవాయితీగా చెరకు సాగు చేసేవారు. చక్కెరకర్మాగారం మూతపడడం, దూర ప్రాంతానికి చెరకును తరలించడానికి చిన్నసన్నకారు రైతులు వ్యయప్రయాలు పడలేక వాణిజ్యపంటగా పామాయిల్ తోటలు వేయడం ఆరంభించారు. రైతులు పామాయిల్ తోటల పెంపకానికి ఆసక్తి చూపడం వల్ల బగ్గందొరవలసలో శ్రీనివాసా పామాయిల్ మిల్లు యాజమాన్యం నర్సరీ ఏర్పాటు చేసి, ప్రభుత్వం నుంచి అందే రాయితీపై రైతులకు మొక్కలు పంపిణీ చేస్తోంది. దీంతో పామాయిల్ ప్లాంటేషన్‌కు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ విషయమై బగ్గందొరవలస పామాయిల్ నర్సరీ ఇన్‌చార్జి కె.శ్రీనివాస రావు వద్ద ప్రస్తావించగా 2023–24 సీజన్‌లో రైతులు 2,800 ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ ప్లాంటేషన్ చేపట్టినట్లు తెలియజేశారు.


రక్తదానంతో ప్రాణదానం



బరంపురం: రక్తదానం చేస్తున్న దృశ్యం

బరంపురం: రక్తదానం చేయడంతో ప్రాణదాతలుగా నిలవవచ్చని ఎంపీ చంద్రశేఖర్ సాహు అన్నారు. సీఎం నవీన్ పట్నాయక్ పుట్టినరోజు పురస్కరించుకొని స్థానిక బిజూ పట్నాయక్ కల్యాణ మండప ప్రాంగణంలో గంజాం జిల్లా బీజేడీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ చంద్రశేఖర్ సాహు మాట్లాడుతూ రక్త నిల్వలు లేకపోవడంతో సకాలంలో రక్తం అందక అనేకమంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'మో ఒడిస్సా' రక్తదాన సంస్థ స్థాపించి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు సైతం రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండాతో పాటు నగర మేయర్ సంఘమిత్ర దొళాయి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక గ్రామ దేవత మాబుడి శాంత అమ్మవారి ఆలయంలో సీఎం పేరున ప్రత్యేక పూజలు చేపట్టారు.

పర్లాకిమిడి: సీఎం నవీన్ పట్నాయక్ పుట్టినరోజు పురస్కరించుకొని గజపతి జిల్లాలో బీజేడీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పర్లాకిమిడి జిల్లా కేంద్ర ఆస్పత్రి, డైమండ్ జూబ్లీ కుష్టురోగుల పునరావాస కేంద్రంలో రోగులకు పండ్లు అందజేశారు. మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో మొక్కలను నాటారు. అనంతరం గురండి మీనాకేటన్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని జీవన బిందు జిల్లా కో–ఆర్డినేటర్ ఇందిరా పట్నాయిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, రూపేష్‌పాణిగ్రాహి, యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, రాష్ట్ర బీజేడీ కమిటీ నాయకులు బసంత్ దాస్, మారుత్‌పాలో, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ మరియం రైయితో, ప్రదీప్ నాయక్, మరియు లక్ష్మీకాంత పోరిచ్ఛా బప్పి పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



బరంపురం: ఆకట్టుకున్న సీఎం సైకత శిల్పం



బరంపురం: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: గురండి మీనాకేతన్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేడీ కార్యకర్తలు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ..

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద జాతీయ రహదారిపై సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంపై పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రతిరోజూ మృతురాలు ఆరికతోట జంక్షన్ వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించేంది. ఈ ప్రమాదంపై పలువురు వాహనదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై అప్పారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

వివిధ చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: వివిధ చోరీకేసుల్లో నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక సిటీబస్టాండ్ వద్దనున్న స్క్రాప్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు షాప్ షట్టర్ ఓపెన్‌చేసి అందులో ఉన్న అల్యూమినియం, రాగి, ఇత్తడి గోనెసంచుల మూటలు పట్టుకుపోయారని బాధితుడు శేఖర్ వన్‌టౌన్ పోలీసులకు ఈ నెల 9వ తేదీన ఫిర్యాదుచేశాడు, ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు అయ్యన్నపేట జంక్షన్‌లో అంజూర్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. నిందితుడి దగ్గర నుంచి రాగి, ఇత్తడి మూటలను స్వాధీనం చేసుకున్నారు. అయితే కేసులో మరో నిందితుడు దుర్గాప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అంజూర్ కుమార్ గతంలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఒక బైక్, భీమిలిలో మరో బైక్ చోరీచేసినట్లు విచారణలో అంగీకరించాడు.

క్లుప్తంగా

ప్రభుత్వం దృష్టికి క్రిస్టియన్ మైనారిటీ సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్

ఇచ్ఛాపురం: జిల్లాలో గల క్రిస్టియన్ మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ అన్నారు. పట్టణంలో గల క్రిస్టియన్ మైనారిటీ సెల్ కార్యాలయం ఆవరణలో సోమవారం జిల్లాలో గల క్రిస్టియన్ మైనారిటీ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనారిటీ పెద్దలు మాట్లాడుతూ జిల్లాలో గల ఏడు నియోజకవర్గాల్లో క్రిస్టియన్లకు ఉపయోగపడే కమ్యూనిటీ భవనాలు, ప్రహరితో కూడిన శ్మశాన వాటికలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం స్థలాలను కేటాయించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ రాజకీయాలకు అతీతంగా పాలన అందజేస్తున్నారని అన్నారు. మళ్లీ అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ జాన్ డేవిడ్, జాయింట్ సెక్రటరీ కణితి ఐజాక్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి చిన్నారావు, జనరల్ సెక్రటరీ గంటా పిలోమెను, జాయింట్ సెక్రటరీ రౌతు దేవకిరణ్, సెక్రటరీ ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 8న రైల్వేలో ప్రత్యేక అదాలత్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పెండింగ్ కారుణ్య నియామక పెన్షన్ కేసులకు సంబంధించి నవంబర్ 8న ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. తగిన ఫార్మాట్‌లో మరణించిన రైల్వే అధికారులు, పింఛన్‌దారుల వివరాలను ఎ-4 పేపర్‌పై రాసి.. అక్టోబరు 31లోగా డివిజనల్ రైల్వే మేనేజర్(పి), మొదటి అంతస్తు, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం కాంప్లెక్స్, దొండపర్తి చిరునామాకు పంపించాలన్నారు. కవరుపై కారుణ్య అదాలత్-2023/ఈస్ట్‌కోస్ట్ రైల్వే/వాల్తేర్ అని కచ్చితంగా రాయాలని సూచించారు.

నాటుసారా కేసులో మరో వ్యక్తి అరెస్టు

మందస: మండలంలో సంచలనం సృష్టించిన నాటుసారా కేసులో మందస పట్టణానికి చెందిన గార పాపారావును సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ తెలిపారు. ఒడిశా సరిహద్దు నుంచి మందసకు చెందిన పాపారావు బొలెరో వాహనంలో నాటుసారా తరలిస్తుండగా పోలీసులు రూ.2.50లక్షలు విలువైన నాటుసారా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలంలోనే బొందికరి గ్రామానికి చెందిన సవర గోపి, బలరాం, కృష్ణలను పట్టుకున్నారు. నాటుసారా రవాణాకు సంబంధించిన నిందితుడు గార పాపారావు పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ ఆదివారం ప్రకటించారు. దీంతో ఆయనను సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. గోపి, బలరాం, కృష్ణలను సోంపేట కోర్టుకు తరలించారు. సోంపేట కోర్టులో వీరికి రిమాండ్ విధించగా నరసన్నపేట జైలుకు తరలించామని ఎస్‌ఐ హరికృష్ణ చెప్పారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు నుంచి జారి పడి జంగేటి మణికంఠ(25) అనే యువకుడు మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ రమేష్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం పట్టణంలోని జెండాల వీధికి చెందిన మణికంఠ ఆదివారం రాత్రి విశాఖపట్నం నుంచి ఆముదాలవలసకు ఈస్ట్‌కోస్ట్ రైలులో ప్రయాణిస్తుండగా చీపురుపల్లి వచ్చే సరికి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెచ్‌సీ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం లారీ ఢీ కొని టెక్కలి శ్రీరామకాలనీకి చెందిన కె.చంద్రశేఖర్(22) అనే యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు పెద్ద, పెద్ద రాళ్లను తీసుకెళ్లి తిరిగి వస్తున్న లారీ టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ వద్ద రోడ్ పక్కగా నడుస్తూ వెళ్తున్న చంద్రశేఖర్‌ను ఢీకొట్టింది. చంద్రశేఖర్ కింద పడగా.. అతని తలపై నుంచి చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు లారీని ఆపి డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. మృతుడి తండ్రి గతంలోనే చనిపోయారు. తల్లి వలస కూలీ. ఇతను మెకానిక్‌గా పనిచేస్తూ మేనమామ ఇంటి వద్ద ఉంటున్నాడు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ చంద్రమౌళి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సలక్షణంగా అక్షరాభ్యాసం



పీఎన్‌కాలనిలో నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసాలు (ఫైల్)

- 20న సామూహిక అక్షరాభ్యాసాలు
- వేడుకకు ముస్తాబవుతున్న ఆలయాలు

శ్రీకాకుళం కల్చరల్: దసరా నవరాత్రుల సమయంలో వచ్చే ముఖ్యమైన రోజు మూలా నక్షత్రయుత ఆశ్వయుజ షష్టి. ఈ పవిత్ర దినాన ప్రత్యేకంగా సరస్వతీ మాతకు పూజలు చేసి హోమాలు నిర్వహిస్తారు. అలాగే ఎంతో మంది తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించుకునేందుకు వీలుగా వాటి వివరాలు ఈ దిగువ ఇస్తున్నాం.

➡ పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలొ ఉన్న శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారికి దసరా ఉత్సవాల సందర్భంగా ఇక్కడ ఉన్న జ్ఞాన సరస్వతీ దేవి వద్ద ఏటా అధిక సంఖ్యలో చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. అయితే ఈనెల 20వ తేదీన ఉదయం 8గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాసాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం 9381949794, 9493085708 నంబర్లకు ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

➡ బాకర్ సాహెబ్ పేటలోని శ్రీదుర్గామహాలక్ష్మీదేవి ఆలయం వద్ద జరిగే ఉత్సవాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెన్నేటి సునీల్ శర్మ తెలిపారు. పాల్గొన దలిచే వారు 96183 90488 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

➡ గోవిందనగర్ కాలనిలోని శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో సరస్వతీ మాత హోమం నిర్వహిస్తున్నామని, సామూహిక అక్షరాభ్యాసాలు కూడా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు మొదలవలస ఉషారాణి తెలిపారు. పాల్గొనే వారు 9440759604, 7989746140 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

➡ బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో 20వ తేదీన సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గణేష్ గురూజీ తెలిపారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించే తల్లిదండ్రులు 9515880619, 9398466840 నంబర్లను సంప్రదించాలని కోరారు.

➡ నానుబాలవీధిలో వెలసిన విజయదుర్గా అమ్మవారి ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అవతారంలో ఉన్న అమ్మవారికి సరస్వతీ హోమం నిర్వహిస్తారు. పాల్గొనే విద్యార్థులకు సరస్వతీ దేవి డాలర్ అందజేస్తామని తెలిపారు. పాల్గొన దలిచే వారు 9676560554, 9155555599 నంబర్లను సంప్రదించాలి.

విజయనగరం జ్ఞాన సరస్వతీ ఆలయం

విజయనగరంలోని జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో మూలా నక్షత్రం రోజున పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎవరైనా అక్షరాభ్యాసం చేయించ దలచుకుంటే 9494777672 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ వినియోగించుకోండి



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మాధవ్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇచ్చే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పిలుపునిచ్చారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 14వ బ్యాచ్‌ను సోమవారం శ్రీకాకుళం 1డిపో మేనేజర్ కె.మాధవ్ ప్రారంభించారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటివరకు 13 బ్యాచులు శిక్షణ పూర్తి చేసుకున్నాయని, ఆర్టీసీలో చాలా విలువలతో కూడిన శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతి ఒక్క విషయాన్ని కూడా జాగ్రత్తగా అవగాహన చేసుకుని నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నతమైన, సుశిక్షితులైన డ్రైవర్లుగా తయారవుతారని అన్నారు. ఆర్టీసీతో పాటు మిగతా డిపార్ట్‌మెంట్‌లలో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 2డిపో మేనేజర్ కే.ఆర్.ఎస్. శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ, ఏఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. తదుపరి బ్యాచ్ వివరాల కోసం మరియు నిర్ణీత ఫీజు, డాక్యుమెంట్స్ వివరాల కోసం 9963091999, 7989723505 నంబర్లను సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

'సుడిదోమ' సోకిన పొలాల పరిశీలన



కుంటికోట వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మందస: మండలంలో సుడిదోమ సోకిన పొలాలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. కుంటికోట, వీరగున్నమ్మపురం, వాసుదేవపురం, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపంటకు సుడిదోమ ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ తెగులు వరి పిలకలు వేసే దశ నుంచి పంటకాలం పూర్తయ్యేవరకు కూడా సోకే అవకాశం ఉందన్నారు. సుడిదోమ లక్షణాలు, నివారణ చర్యలు రైతులకు వివరించారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ కార్యాలయంలో గానీ, రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కుంటికోట సర్పంచ్ దుంపల వైకుంఠరావు, వ్యవసాయ విస్తరణాధికారి బల్లు జగ్గారావు, వీఏఏ ప్రశాంతి, పార్టీ నాయకులు దాసరి రామారావు, రైతులు టొంప శేఖర్, దాసరి నారాయణ, రొక్కం మోహనరావు ఉన్నారు.

● వెయ్యిన్నొక్క బిందెలతో జలాభిషేకం



పెద్దలంబ పంచాయతీ నారాయణపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి వెయ్యిన్నొక్క బిందెల నీటితో సోమవారం జలాభిషేకం చేశారు. వానలు కురవాలని కోరుతూ అభిషేకం నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. - సారవకోట

అమ్మ సంబరం



- నేటి నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు ప్రారంభం
- పకడ్బందీగా ఏర్పాట్లు

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఇష్టదైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలను మొదటి రోజు గ్రామానికి చెందిన కమ్మకట్టు చినఅప్పలనాయుడు వారసులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి ప్రారంభిస్తారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారు. జాతరకు 5 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు అమ్మవారి దర్శనానికి రానున్నందున 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు క్యూలు, తాగునీరు, వైద్యసాయం, మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సంగిడీలు, వెయిట్ లిఫ్టింగ్, ఉలవల బస్తాల పోటీలు నిర్వహిస్తారు. ఉత్సవంలో మూడోరోజు అమ్మవారికి ప్రీతి పాత్రమైన ఘటాల పండుగ నిర్వహిస్తారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: ఏపీలో కుల గణన చేపట్టేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు అన్నారు. లొద్దపుట్టి ప్రజా సంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు మేలు చేసే విషయంలో సీఎం జగనన్న దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏ కుల జనాభా ఎంతనేది స్పష్టంగా తెలుస్తుందని, కుల గణనను పూర్తి పారదర్శకంగా జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి పిన్నింటి జోగారావు, సోంపేట మండల బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఇరోతు శ్రీనివాసరావు, బారువ పట్టణ బీసీ సంఘం నేత ఎస్.ఉమామహేశ్వరరావు, బీసీ సంఘం ప్రతినిధులు గుడియా జగ్గారావు, రుషి పాల్గొన్నారు.

హనీ ఈజ్ ద బెస్ట్



కాశీబుగ్గ: సినీ హీరోయిన్ మెహరీన్ సోమవా రం పలాసలో మెరిసింది. ఆమెను చూసేందుకు స్థానిక యువకులు ఎగబడ్డారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీనటి మెహరీన్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రముఖ సినీ హీరోయిన్ మెహరీన్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అర్చకులు ఆమెకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా మెహరీన్ విలేకరులతో మాట్లాడుతూ సూర్య దేవాలయం దర్శించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని, సినీరంగంలో తనకంటూ గుర్తింపు రావడం దేవుని ఆశీస్సులతోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులకు భోజనం, ఇతర వసతులు సక్రమంగా అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని రామలక్ష్మణ జంక్షన్ దగ్గర ఉన్న ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలికల వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థి దశ జీవితంలో చాలా కీలకమైనదని, చదువు అనేది మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలిగే ఏకైక మార్గమని అన్నారు. విద్యార్థినులు అందరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. వసతి గృహం నిర్వహణపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. వంటగది, స్టోర్ రూం, సరుకులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమ అధికారి గుర్రాల లలిత, ఇతర హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు అక్రమ మద్యం విక్రయదారులపై కేసులు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అక్రమ మద్యం విక్రయిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదుచేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ ఎస్.గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఈ కేసుల్లో ముద్దాయిల్ని సోమవారం కవిటిలో మండల మేజిస్ట్రేట్ కోర్టులో మండల మేజిస్ట్రేట్ పి.శేఖర్ ఎదుట హాజరుపరిచారు. ఈ నెల 2 వ తేదీన 20 మద్యం సీసాలతో పట్టుబడిన రాజపురం నివాసి టెంక మోహనరావుకు రూ.2లక్షల అపరాధ రుసుంతో బైండోవర్ కేసు, ఈ నెల 4 న దొరికిన బల్లిపుట్టుగకు చెందిన నల్లాన రామారావుకు రూ.30,000 అపరాధ రుసుంతో బైండోవర్ కేసు, సెప్టెంబర్ 7న దొరికిన ఆర్.బెలగాం నివాసి దేవాడ కేశవరామరాజుకు రూ.2లక్షల అపరాధ రుసుంతో పాటు బైండోవర్ కేసుల్ని విధించినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి.

'బాల్య వివాహాల నిర్మూలనకు కృషి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల్య వి వాహ రహిత భారత దేశ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, చైల్డ్‌లైన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో సీఎం పేరిట ప్రత్యేక పూజలు



శ్రీముఖలింగంలో పూజలు చేస్తున్న కృష్ణదాస్

జలుమూరు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఇదే కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం శ్రీముఖలింగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరిట పూజలు నిర్వహించి గోలెం మొక్కులు మొక్కారు. అర్చకులు వారాహి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పుణ్యాహవచనాలతో దీవించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ టి.సతీష్ కుమార్,ఎంపీటీసీ సభ్యులు కె.హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో గిడుగు వారసులు



గిడుగు రామ్మూర్తి పంతులు కుటుంబ సభ్యులతో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి కుటుంబ సభ్యులు సోమవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలను సందర్శించారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న గిడుగు వారి ఐదో తరం వారసులైన గిడుగు సరస్వతి కుటుంబ సమేతంగా విచ్చేసి కళాశాల తెలుగు విభాగాన్ని సందర్శించడంతోపాటు కళాశాల ప్రాంగణంలో గల గిడుగు రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గిడుగు సేవలను, వారి అనుభవాల గురించి తెలియజేశారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎంపీ సత్యనారాయణ తెలుగు విభాగం తరఫున వారిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ పైడి వెంకటరమణ, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఢిల్లీశ్వరరావు, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ శశిభూషణ్, హిందీ అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస రావు పాత్రో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



తురకలకోట వద్ద పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

నందిగాం: మండలంలోని తురకలకోట వద్ద సోమవారం సాయంత్రం ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అదుపు తప్పి పక్కనున్న కాలువలోకి ఒరిగింది. శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా నందిగాం మండలం తురకలకోట వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మితి మీరిన వేగంతో బస్సు వైపు వస్తున్న లారీను తప్పించే ప్రయత్నంలో రోడ్డు ప్రక్కన ఉన్న కాలువలోకి ఒరిగిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో కేవలం ఆరుగురు మాత్రమే ఉండటంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికుల్లో ఒకరైన టెక్కలి శ్రీనివాసనగర్‌కు చెందిన బాలామణి అనే వృద్ధురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గుర్తించిన హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రయాణికులకు సపర్యలు చేసి స్వల్పంగా గాయపడిన వృద్ధురాలిని టెక్కలి ఆస్పత్రికి తరలించారు.

● ప్రమాదమని తెలిసినా..



రైలు ముందు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు



పలాస రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం శివారులో ప్రయాణికులు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. కోరమాండల్, గరీబ్ రథ్ వంటి సూపర్‌ఫాస్ట్ రైళ్లు వచ్చినప్పుడు వాటికి లైన్ క్లియర్ చేయడం కోసం రైళ్లు ఆగి ఉంటాయి. సోమవారం ఇలాగే రైలు ఆగి ఉంటే ఇంజిన్ ముందు నుంచి ప్రయాణికులు ప్రమాదకరంగా రాకపోకలు సాగించారు.
– కాశీబుగ్గ